క్లుప్తంగా

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: పౌర్ణమి సందర్భంగా పెందుర్తి సాధు మఠం వద్దనున్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ శర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

రేపు పాపయ్యరాజుపాలెంలో ఏక్తా ధ్యానం

పెందుర్తి: పాపయ్యరాజుపాలెం బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యాని విజ్ఞాని ప్రాజెక్ట్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏక్తా ధ్యానం నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రతినిధులు తెలిపారు. ధ్యాన మాస్టర్ శరగడం తులసి ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 7 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ధ్యానంపై శిక్షణ, అవగాహన ఉంటుందన్నారు.

చందనోత్సవం నాటికి ప్రసాద్ స్కీం పనుల పూర్తి

సింహాచలం: వచ్చే నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం నాటికి ప్రసాద్ పథకం పనులు పూర్తి చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని అడవివరంలో శుక్రవారం జరిగిన స్వామివారి డోలోత్సవంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, ఆలోగానే ప్రసాద్ స్కీమ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు

పెందుర్తి: స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, స్థానిక మండల అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్కిల్ హబ్‌లో హ్యాండ్ ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 3 నెలల పాటు జరిగే ఈ శిక్షణ కోసం 8వ తరగతి చదివిన 18–45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు అర్హులన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99669 65502 ఫోన్ నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఏపీ నాన్ గ్యాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ జోన్-1 కార్యవర్గ సమావేశం పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ బి.సేవా నాయక్, ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.విజయ సారథి, కోశాధికారి డి.కోదండరావులు పాల్గొని సమస్యలపై చర్చించారు. ప్రధానంగా వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని, పారా వెటర్నరీ కౌన్సిల్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఫెడరేషన్ చైర్మన్‌గా డి.కోదండరావును, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి చైర్మన్‌గా వెంకటలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో చైర్మన్ వైవీ ప్రసాద రావు, ఎం.రాఘవరావు, ఎం.సాగర్ బాబు, ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి నూకాంబిక దేవస్థానం ఈవోగా వెంపలి



వెంపలి రాంబాబు

మహారాణిపేట: అనకాపల్లిలోని నూకాంబిక ఆలయ ఈవోగా సింహాచలం దేవస్థానంలో ఏఈవోగా పని చేస్తున్న వెంపలి రాంబాబు నియమితులయ్యారు. కనక మహాలక్ష్మి ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్న ఆయన్ని ఇటీవల సింహాచలం ఏఈవోగా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి ఈవోగా నియమించారు. శనివారం రాంబాబు బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

- పెరిగిన వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు
- మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు
- అమలుకు నోచని రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు



విస్తరణకు నోచుకోని పరవాడ-యలమంచిలి రహదారి

ఇరుకు రోడ్లు.. ప్రమాదకర మలుపులు

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతానికి అనుసంధానంగా ఉన్న రోడ్లు ఇరుకుగా మారాయి. ప్రస్తుతం పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లు విస్తరణకు నోచుకోక పోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **పరిశ్రమలకు షిప్టుల వారీగా ఉదయం, సాయంత్రం విధుల్లోకి వెళ్లే సమయంలో కార్మికుల కష్టాలు వర్ణనాతీతం.**



ఇరుకుగా మారిన పరవాడ-అనకాపల్లి రోడ్డు

పరవాడ:

పరవాడ-యలమంచిలి, పరవాడ-అనకాపల్లి రోడ్ల అభివృద్ధిని ప్రభుత్వం గాలికి వదిలేసింది. దీంతో పారిశ్రామిక, వ్యాపార, కార్మిక, కర్షక వర్గాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఈ రెండు రోడ్ల విస్తరణకు కొన్నేళ్ల క్రితం ఆర్ అండ్ బీ రూపొందించిన ప్రతిపాదనలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

పరిశ్రమలతో వాహనాల రద్దీ

సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్, పరవాడ ఫార్మాసిటీ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో నెలకొల్పిన సుమారు 205 ఔషధ పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు, పరిశ్రమలకు ఎగుమతులు, దిగుమతులకు ఉపయోగించే భారీ వాహనాల రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. రోజూ ఉదయం 8.30 నుంచి 10 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల మధ్య పరిశ్రమలకు వెళ్లి వచ్చే ఉద్యోగులు, కార్మికులతో రహదారులు రద్దీగా మారుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకోవడం పరిపాటిగా మారింది.



పరవాడ-భర్నికం రోడ్డు మధ్యలో ప్రమాదకర మలుపు

ఇరుకు వంతెనలతో ఇక్కట్లు

పరవాడ-యలమంచిలి రహదారిలో ఊటగెడ్డ సమీపంలో దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. పూర్వం ఇరుకుగా నిర్మించిన వంతెనల వద్ద భారీ వాహనాలు తప్పించుకునే క్రమంలో ఇరుక్కుపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఏదైనా **వాహనం మార్గం మధ్యలో చెడిపోతే ప్రయాణికులు గంటల తరబడి అవస్థలు పడుతున్నారు. రహదారిలో పరవాడ సబ్‌స్టేషన్, సినిమాహాలు కూడలి,** ఊటగెడ్డ కూడళ్లలో పరిశ్రమలకు వెళ్లే సమయంలో కార్మికులు, ఉద్యోగులతో **రద్దీగా** మారుతున్నాయి. ఎప్పుడుపడితే అప్పుడు **పరి**శ్రమలకు బొగ్గు, ఇతర యంత్ర సామగ్రిని సరఫరా చేసే భారీ వాహనాల వల్ల ట్రాఫిక్ **సమస్యలు** మరింత పెరుగుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

సుమారు 12 కి.మీ. నిడివి కలిగిన పరవాడ-అనకాపల్లి రహదారి విస్తరణకు నోచుకోక జిల్లా ప్రధాన కేంద్రమైన అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇరుగ్గా ఉన్న ఈ రహదారిలో వెంకటాపురంలోని ఓ పరిశ్రమకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతో తరచూ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏడేళ్ల క్రితం స్కూల్ నుంచి సైకిల్‌పై స్వగ్రామం వెంకటాపురం వెళ్తున్న క్రమంలో పరవాడ-భర్నికం మలుపువద్ద భారీ వాహనం ఢీకొని ఓ విద్యార్థి మరణించింది. నాలుగేళ్ల క్రితం భర్నికం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి ప్రాణాలు పోగొట్టుకున్నారు. భర్నికం సమీపంలో ఓ కల్వర్టుకు రక్షణ గోడలు లేక రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటన్నిటికి రోడ్లను విస్తరించకపోవడమే ప్రధాన కారణమని ప్రజలు వాపోతున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు



పరవాడ-యలమంచిలి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో రహదారిలో భారీ వాహనాలు, ఉద్యోగులు, కార్మికుల వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎంత ముందుగా బయల్దేరుతున్నా.. కొన్నిసార్లు ట్రాఫిక్‌లో చిక్కుకుని సమయానికి విధులకు వెళ్లలేకపోతున్నాం. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– పైల ముత్యాలనాయుడు, కార్మికుడు, ఫార్మాసిటీ

రోడ్ల అంచుల్ని పూడ్చాలి



ఇరుగ్గా మారిన పరవాడ-అనకాపల్లి రోడ్డును విస్తరించాలి. ఏదైనా భారీ వాహనం వస్తే ఆటోను తప్పించడం కష్టంగా ఉంది. రోడ్ల అంచులు కోతకు గురవడంతో తరచూ వాహనాలు రిపేర్లకు వస్తున్నాయి. వీధి దీపాల్లేక రాత్రి సమయంలో వంతెనలపై ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నాం. రోడ్ల అంచులను మట్టితో పూడ్చేందుకు సత్వర చర్యలు చేపట్టాలి.

– బంధం సింహాచలం, ఆటో డ్రైవర్, వెన్నలపాలెం

రోడ్లను విస్తరించాలి



నిత్యం భారీ వాహనాలతో ప్రధాన రహదారులు రద్దీగా మారాయి. వ్యాపార లావాదేవీలకు పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగించడం కష్టమవుతోంది. అధిక బరువులు వేసుకొని భారీ వాహనాలను తప్పించుకుని ఇళ్లకు చేరాలంటే భయమేస్తోంది. అనకాపల్లి రహదారి మరింత ఇరుగ్గా ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని గుర్తించి రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– గుండా చిననాగేశ్వరరావు, వ్యాపారి, వాడచీపురుపల్లి

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత రామకృష్ణకు బాండ్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ



దాత బాలకృష్ణకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పెందుర్తి దరి సుజాతనగర్‌కు చెందిన దొగ్గ రామకృష్ణ రూ.లక్ష, నెల్లూరు జిల్లా కావలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన వి.బాలకృష్ణ రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలోని విరాళాల స్వీకరణ కౌంటరులో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతలకు ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్‌లు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్యేగారూ.. హామీ నిలబెట్టుకోరూ..

- శిథిలావస్థకు చేరిన సామాజిక భవనంతో ఇబ్బందులు



కూలడానికి సిద్ధంగా ఉన్న సామాజిక భవనం

పరవాడ: మండలంలోనినాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో కొన్నేళ్ల క్రితం ప్రజావసరాల కోసం నిర్మించిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. ఏ క్షణమైనా కూలిపోయే దశలో ఉంది. గ్రామంలో సభలు, సమావేశాలు, పండగలు వంటి కార్యక్రమాల నిర్వహణకు ఈ సామాజిక భవనమే పెద్ద దిక్కు. సామాజిక భవనం నిర్వహణ పట్టించుకునే నాథుడు లేక శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం భవనం శ్లాబ్ పెచ్చులూడి ఏ మాత్రం వర్షం వచ్చినా కారిపోతుంది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. పిల్లర్లు పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. గచ్చులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. దీంతో గ్రామస్తులు ఆరు బయటే పందిళ్లు వేసుకుని, పండగలు, కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని తొలగించి, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హామీ అంగుళం కూడా ముందుకుపోలేదు. వీలైనంత వేగంగా నిధులు మంజూరు చేసి, నూతన భవనాన్ని నిర్మించి వాగ్దానం నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం



మహా మృత్యుంజయ హోమం, పూర్ణాహుతిలో పాల్గొన్న గురుమాత అన్నపూర్ణమ్మ తదితరులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం గురుపాదుకా పూజతో శుక్రవారం ముగిసింది. గురువారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా నవగ్రహ మండపం, బ్రహ్మ మండపం, సర్వతోభద్ర మండపం, రుద్ర మండపం, కలశ స్థాపన పూజలు జరిగాయి. ఋత్వికులు మృత్యుంజయ జపాలు, నవగ్ర జపాలు, అయుష్య సహిత పారాయణ, జన్మ నక్షత్ర జపాలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, యూకే, కెనడా తదితర విదేశాల నుంచి వచ్చిన అనేక మంది శిష్యులు వచ్చారు. ఉదయం నుంచి వల్లభేశక్షేత్ర పాల దశ మహావిద్య సహిత విద్యామ్నయ కలశ స్థాపన, లలితా సహస్ర నామార్చనలు జరిపారు. సాయంత్రం 4 నుంచి గురుపాదుకా పూజ, నృత్యాలు, భజనలతో పాటు అమృత కన్యా గురుకులం బాలికలు సైన్స్ ప్రాజెక్ట్ ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మూర్తి, వార్డెన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



లక్ష్మీ హవనంలో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ జరిపారు. అనంతరం పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

లక్ష్మీ ఉత్సవాల్లో భాగంగా వేంకటాద్రిపై శుక్రవారం లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీసూక్త విధానంలో సాముహిక కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, అమ్మవారిని పసుపు కుంకుమలతో అర్చించారు. శాస్త్రోక్తంగా లక్ష్మీ హవనం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కూటమి.. అక్రమ అంతస్తులు

- చినముషిడివాడలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భారీ భవనం
- అధికార పార్టీ నాయకులు కావడంతో చర్యలకు జీవీఎంసీ వెనుకడుగు



చినముషిడివాడలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

పెందుర్తి: అధికార 'కూటమి'నేతల భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఎక్కడికక్కడ అధికార యంత్రాంగాన్ని చెప్పుచేతల్లో పెట్టుకుని, కనీస నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జీవీఎంసీ పరిధిలో ఈ తరహా నిర్మాణాలు మరీ ఎక్కువయ్యాయి.

తాజాగా చినముషిడివాడ నడిబొడ్డున బీఆర్‌టీఎస్ రహదారికి అత్యంత సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కూటమి నేతలు ఓ భారీ నిర్మాణం చేపట్టారు. దీనిపై చర్యలకు జీవీఎంసీ అధికారులు వెనుకంజ వేస్తుండటంపై స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

ప్లాన్ ఒకటి.. నిర్మాణం మరొకటి

చినముషిడివాడ బీఆర్‌టీఎస్ రహదారికి సమీపంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు నిర్మాణం చేపట్టారు. దీనికి జీ+2 ప్లాన్ తీసుకున్నారు. ప్రస్తుతం నాలుగు అంతస్తులకు శ్లాబ్‌లు వేశారు. నిర్మాణంలో ఎక్కడా సెట్‌బ్యాక్స్ నిబంధనలు పాటించలేదు. ప్లాన్ అనుమతులకు దరఖాస్తు చేసుకునేటప్పుడు కూడా తప్పుడు పత్రాలు సమర్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నచిన్న నిర్మాణాలపై విరుచుకుపడే జీవీఎంసీ యంత్రాంగం దీనిపై చర్యలకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. తక్షణమే ఈ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉంది

చినముషిడివాడ బీఆర్‌టీఎస్ రహదారి వద్ద జరుగుతున్న నిర్మాణం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారు. ప్లాన్ నిబంధనలు మీరడంతో తాత్కాలికంగా పనులు నిలుపుదల చేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– మంగలక్ష్మి, ప్లానింగ్ కార్యదర్శి, చినముషిడివాడ

వైభవంగా సత్తెమ్మ వార్షిక జాతర





సత్తెమ్మతల్లికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు వెంకటరావు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి వార్షిక జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి అర్చకులు విశేషంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వార్షిక జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని, అమ్మవారి మూలవిరాట్‌ని పూలతో ముస్తాబు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిపారు. మజ్జిగ, మంచినీరు అందించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటి గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి



రైతులకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: రైల్వే వంతెన నిర్మాణంలో సాగు చేసుకుంటున్న భూములను కోల్పోతున్న రైతులకు సమగ్ర విచారణ చేపట్టి తగిన న్యాయం చేయాలని సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు డిమాండ్ చేశారు. నార్త్ సింహాచలం నుంచి పెందుర్తి రైల్వే లైన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల ధర్నా శిబిరాన్ని శుక్రవారం సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి భూముల్లో దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ రైతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు రైల్వే అధికారులు సింహాచలం దేవస్థానానికి పరిహారం ఇస్తామనడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆక్షేపించారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పూర్తిస్థాయి విచారణ జరిపి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో రైతులు, సీపీఐ సానుభూతిపరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా దర్బార్

పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజా దర్బార్) కార్యక్రమాన్ని శనివారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెందుర్తి గ్రామీణ, పట్టణ, సబ్బవరం, పరవాడ మండలాలతో పాటు నియోజకవర్గ పరిధిలోని పెదగంట్యాడ సమస్యలపై ప్రజలు నేరుగా ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందించవచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

హోలీ.. రంగుల్లో తేలి..



అడవివరంలో రంగులు జల్లుకుంటున్న చిన్నారులు

సింహాచలం: హోలీ వేడుకలను 93, 98వ వార్డు పరిధిలో యువత, చిన్నారులు శుక్రవారం పెద్ద ఎత్తున జరిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రంగుల్లో మునిగితేలారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. 93వ వార్డు పరిధిలోని ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, బాలాజీ నగర్, గణేష్ కాలనీ తదితర ప్రాంతాలు, 98వ వార్డు పరిధిలోని అడవివరం, సింహపురికాలనీ, గోశాల జంక్షన్, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో హోలీ సందడి ఎక్కువగా కనిపించింది.